

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నానక్‌నగర్‌లో ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులతో పోలీసుల వాగ్వాదం

# మా భూములు మాగ్గావాలే

- నానక్‌నగర్‌లో నినదించిన ఫార్మా భూ బాధిత రైతులు
- సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులపై మండిపాటు

యాచారం, జనవరి 18: 'మా భూములు మాగ్గావాలి. ఫార్మాసిటీ కోసం ఇయ్యం. మా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి' అని రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నానక్‌నగర్ ఫార్మాసిటీ భూబాధిత రైతులు డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సమన్వయ కర్త కవుల సరస్వతి ఆధ్వర్యంలో నానక్‌నగర్‌లో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మర్లకుంటతండా, మంగళిగడ్డ తండాలకు చెందిన ఫార్మాసిటీ బాధిత రైతులు, వివిధ సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సమావేశాన్ని ప్రారంభిస్తున్న సమయంలోనే హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు, ఎస్సైలు తేజంరెడ్డి, రూపశ్రీ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఇక్కడ ఎవరిని అడిగి సమావేశం ఏర్పాటు చేశారని, మైకు పెట్టేందుకు వీలు లేదని సీఐ కృష్ణంరాజు వారికి సూచించారు. తమకు హైకోర్టు ఆర్డర్ ఉందని అందుకే సమావేశం నిర్వహించినట్టు సమన్వయకర్త కవుల సరస్వతి బదులిచ్చారు. ఇంతలోనే హైకోర్టు సీనియర్ న్యాయవాది సాదిక్ జోక్యం చేసుకొని రైతులను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించడంతో ఎస్సై తేజంరెడ్డి ఆయనపై సీరియస్ అయ్యారు. దీంతో అక్కడి నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోర్టు ఆర్డర్ కాపీ చూపించడం, రైతులు వాదనకు దిగడంతో పోలీసులు వెనుదిరిగారు. దీంతో సమావేశం ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసి పథకాలు వర్తించేలా చూడాలని కోరారు.

## • భూసేకరణ చట్టాన్ని రద్దు చేయాలి

2017 భూసేకరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కవుల సరస్వతి డిమాండ్ చేశారు. 31జీవోను రద్దు చేస్తామన్న రేవంత్ సర్కారు అదే జీవోను కొనసాగించడం సరికాదన్నారు. తెలంగాణ పీపుల్స్ జేఏసీ జాయింట్ కన్వీనర్ కన్నెగంటి రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామన్న ముదిరెడ్డి కోదండరెడ్డి నేడు రైతు కమిషన్ చైర్మన్ కాగానే రైతులు గుర్తుకు రావడంలేదా అని ప్రశ్నించారు.



ఆదిలాబాద్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతు దేవ్‌రావు బంధువులు, గ్రామస్థులు

# రైతన్నకు శాపం.. ఎవరిదీ పాపం

- బ్యాంకు అధికారుల వేధింపులతో రైతు ఆత్మహత్య
- బ్యాంకులోనే పురుగుల మందు తాగిన దేవ్‌రావు
- అధికారులపై చర్యలకు బంధువుల రాస్తారోకో

ఆదిలాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ): జాదవ్ దేవ్‌రావు (51)ది ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడ స్వగ్రామం. ఆయనకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. వానకాలంలో పత్తి, కంది పంటలు సాగు చేశాడు. రాళ్ల భూములు కావడంతో పాటు వర్షాలు లేని కారణంగా దిగుబడులు సరిగా రాలేదు. ఐదెకరాల్లో 15 క్వింటాళ్ల పత్తి, ఐదు క్వింటాళ్ల కందుల దిగుబడి వచ్చిందని కుటుంబసభ్యులు తెలిపారు. దేవ్‌రావు రామాయి డీజీబీ బ్యాంకులో రూ.2 లక్షలకు పైగా పంట రుణం ఉండటంతో ఆయనకు రుణమాఫీ వర్తించలేదు. సాగు కోసం రూ.ఒక లక్ష వరకు ప్రైవేటు అప్పులు చేశాడు. ఇదే దశలో ఆయన భార్య బీజిబాయి కిడ్నీ జబ్బుతో మంచాన పడింది. ఆమె వైద్య ఖర్చుల కోసం నాలుగేండ్ల కిందట ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.3.5 లక్షల వ్యక్తిగత రుణం తీసుకున్నాడు. రుణం ఇవ్వడానికి బ్యాంకు అధికారులు దేవ్‌రావుకున్న ఐదెకరాల భూమిని మార్టిగేజ్ చేయించుకున్నారు. వాయిదాల పద్ధతిలో ప్రతి 6 నెలలకోసారి రూ.25 వేల చొప్పున చెల్లిస్తూ వస్తున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా రెండు కిస్తీలు చెల్లించలేకపోయాడు. ఒకవైపు పంటలు సరిగా పండకపోవడంతో, మరోవైపు ప్రభుత్వ పంట రుణం మాఫీ చేయకపోవడంతో తీవ్రంగా మదనపడ్డాడు. ఈ సమయంలో బ్యాంకు అధికారులు ఇటీవల గ్రామానికి వెళ్లి తీసుకున్న లోన్ కిస్తీలు చెల్లించాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. రెండు రోజులుగా ఆదిలాబాద్‌లోని బ్యాంకుకు వచ్చి అధికారులను కలిసి కాళ్లావేళ్లా పడి కొంత గడువు ఇవ్వాలని రైతు దేవ్‌రావు వేడుకున్నా, ఆ అధికారుల మనసు కరగలేదని తమకు చెప్పుకున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



దేవ్‌రావు (ఫైల్)

### బ్యాంకులోనే పురుగుల మందు తాగిన రైతు

కిస్తీలు చెల్లించాలని బ్యాంకు అధికారులు వేధిస్తుండటంతో తాళలేని రైతు దేవ్‌రావు చావే పరిష్కారం అనుకున్నాడు. పురుగుల మందు డబ్బాతో శనివారం స్వయంగా అదే బ్యాంకుకు చేరుకున్నాడు. నేరుగా వెళ్లి బ్యాంకులోనే పురుగుల మందుతాగాడు. అంతకుముందు తన కుమారుడు ఆకాశ్‌కు ఫోన్ చేసి బ్యాంకు అధికారుల వేధింపుల కారణంగా తాను పురుగుల మందు తాగుతున్నట్టు చెప్పాడు. బ్యాంకులోనే కుర్చీలో ఆపస్మారకస్థితిలో పడి ఉన్న దేవ్‌రావును సిబ్బంది రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. బ్యాంకులో పురుగుల మందు డబ్బా పోలీసులకు లభించింది. పురుగుల మందు తాగిన సమయంలో బ్యాంకు సీసీ పుటేజీ కూడా బయటకొచ్చింది. దీంతో వేధింపులకు పాల్పడిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా బ్యాంకు ఎదుట పోలీసులు బందోబస్తు ఏర్పాట్లుచేశారు. బ్యాంకుకు వచ్చిన దేవ్‌రావు కిస్తీల చెల్లింపు కోసం అధికారులను గడువు అడిగినా ఒప్పుకోకపోవడంతో వెంట తెచ్చుకున్న పురుగుల ముందు తాగాడని, వారు వెంటనే దవాఖానకు తరలించకుండా కుర్చీలో కూర్చొబెట్టారని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో ఆయన ప్రాణాలు విడిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కుటుంబసభ్యులు, గ్రామస్థుల ఆందోళన

రైతు దేవ్‌రావు మృతికి కారణమైన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బ్యాంకు ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బ్యాంకు అధికారులు రైతు భూమిని మార్టిగేజ్ చేయించుకొని వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. అధికారుల వేధింపులు భరించలేకే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

# దేవ్‌రావుది సర్కారు హత్యే

- రుణమాఫీ కాకపోవడంతోనే రైతు బలవన్మరణం
- బాధిత కుటుంబానికి 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాకపోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సైద్పూర్‌కు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్య ఎంతో బాధించిందని తెలిపారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి మాట తప్పడం, రైతు భరోసా ఎత్తివేయడంతోనే దేవ్‌రావు ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. తన పేరిట రుణం ఉన్న బ్యాంకులోనే పురుగుల మందు తాగి బలన్మరణానికి పాల్పడటం బాధాకరమని పేర్కొన్నారు. ఇది ముమ్మాటికీ సర్కారీ హత్యేనని మండిపడ్డారు. రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పేరిట మోసం ఒకవైపు.. రైతు వ్యతిరేక విధానాలు మరోవైపు వారిని బలవన్మరణాల వైపు పురిగొల్పుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్నదాత అవస్థల పాలవుతున్నా, ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. అప్పులు తీరక అన్నదాతలు మనోవేదనకు గురవుతున్నారని, ఈ ఆత్మహత్యలన్నీ సర్కారీ హత్యేలనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ ఏలుబడిలో రాష్ట్రం అంధకారం

రుణమాఫీ కాక దిక్కుతోచని స్థితిలో ఉన్న లక్షలాది మంది రైతుల అప్పులను వెంటనే మాఫీ చేసి, ప్రభుత్వం వారిని రుణవిముక్తులను చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దేవ్‌రావు కుటుంబానికి పట్టిన దీనస్థితి మరే కుటుంబానికి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సూచించారు. పదేండ్లపాటు తెలంగాణలో గుండెలపై చేయి వేసుకొని హాయిగా బతికిన రైతుల జీవితాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పూర్తిగా అంధకారం అలుముకుందని, గతంలో సాగు, పంట దిగుబడిలో నంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ ఇప్పుడు అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉండటం కాంగ్రెస్ సర్కారు చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

### ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదు

అన్నదాతలారా! దయచేసి ఆత్మహత్యలు చేసుకోవద్దు అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. నమ్మించి మోసం చేసిన ఈ నయవంచక కాంగ్రెస్ సర్కారును నిలదీద్దాం, హామీలు అమలయ్యే దాకా కొట్లాడి ముఖ్యమంత్రి మెడలు వంచుదాం తప్ప ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు.

## ఏదుట్ల సబ్ స్టేషన్ వద్ద రైతుల నిరసన

గోపాల్‌పేట, జనవరి 18 : విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించినా.. సరఫరా చేయడంలేదని శనివారం వనపర్తి జిల్లా ఏదుట్ల సబ్‌స్టేషన్ వద్ద రైతులు నిరసనకు దిగారు. 1.96 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఈ నెల 9న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించినా.. సరఫరా లేదని మండిపడ్డారు. లోవోల్టేజీ సమస్యను కేసీఆర్ ప్రభుత్వంలో నాటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా.. సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశారని గుర్తుచేశారు. ఏఈ హర్షవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. సబ్ స్టేషన్ తమకు అప్పగించలేదని, ఆపరేటర్లు అలాట్ కాలేదని, మంగళవారం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

## చెరువులు నింపాలని రైతుల దీక్ష

రాజాపేట, జనవరి 18 : కాళేశ్వరం ప్రాజెక్టు 15వ ప్యాకేజీ ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపి సాగుకు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ రాజాపేట మండల కేంద్రంలో రైతు జేఏసీ నాయకులు శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ మాట్లాడుతూ.. మండలంలోని చెరువులన్నీ నీళ్లు లేక వట్టిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. చెరువులు నింపేవరకు దీక్షలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# పొలాలకు పవర్ కట్

- ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ తొలిగింపు
- కోటిన్నర కట్టాల్సిందేనన్న విద్యుత్తుశాఖ అధికారులు
- దమ్మాయిగూడలోని భోగారంలో సర్కారు నిర్వాకం



కీసర, జనవరి 18: వ్యవసాయ పొలాలకు సాగునీటిని అందించే మోటర్లకు కరెంట్ అందించే ట్రాన్స్‌ఫార్మర్లకు అధికారులు కనెక్షన్ తొలిగించారు. కనీస బిల్లు రూ. 30 కట్టలేదనే వంకతో కరెంట్ సరఫరా బంద్ చేశారు. దీంతో పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని భోగారంలో ముందస్తు సమాచారం లేకుండా అధికారులు ఈ చర్యకు పూనుకోవడంతో రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు. లైన్‌మెన్ భాస్కర్ తమ ట్రాన్స్‌ఫార్మర్లను బంద్ చేసి వైర్ కట్టినట్టు రైతులు చెబుతున్నారు. ఈ విషయమై ఏఈ మురళీకృష్ణను వివరణ కోరగా కీసర మండలం భోగారంలో రూ. కోటిన్నర వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. కట్టకపోవడంతోనే ట్రాన్స్‌ఫార్మర్లను బంద్ చేసినట్టు చెప్పారు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ రాగి రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో పదేళ్ల పాటు రైతులను గుండెల్లో పెట్టి చూసుకున్నారని గుర్తుచేశారు.



## చివరి ఆయకట్టుకు ఇంకెప్పుడు నీళ్లిస్తరు?

### కాల్వలను ఇంకెప్పుడు పూర్తి చేస్తరు?.. లక్ష్మాపురం శివారులో రైతుల నిరసన

నాగారం, జనవరి 18 : చివరి ఆయకట్టుకు ఇంకెప్పుడు నీళ్లిస్తారంటూ సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధిలోని లక్ష్మాపురం రైతులు ప్రశ్నిస్తున్నారు. లక్ష్మాపురం శివారులో అసంపూర్తిగా ఉన్న ఎస్సారెస్పీ పిల్ల కాల్వలను పూర్తి చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. అసంపూర్తిగా ఉన్న కాల్వలతో ఆయకట్టు చివరి రైతులకు సాగు నీరందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## కలెక్టరేట్‌కు 'మంచు' పంచాయితీ

### అదనపు కలెక్టర్ ముందు హాజరైన మనోజ్



రంగారెడ్డి, జనవరి 18 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ సమీపంలో ఉన్న తన ఆస్తులను కొట్టేయటానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారంటూ సినీ నటుడు మంచు మోహన్‌బాబు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సీనియర్ సిటిజన్ ఫోరంలో దరఖాస్తు పెట్టుకున్నారు. కొంతకాలంగా సినీనటుడు మోహన్‌బాబు కుటుంబంలో ఆస్తుల కోసం పెద్ద ఎత్తున గొడవలు జరుగుతున్న విషయం విదితమే. మోహన్‌బాబు రెండో కుమారుడు మంచు మనోజ్ తన ఆస్తులు తనకు ఇవ్వాలంటూ చేసిన ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అందులో భాగంగానే మోహన్‌బాబు తాను సంపాదించుకున్న ఆస్తులపై తనకే హక్కు కల్పించాలంటూ కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయంపై మంచు మనోజ్ శనివారం వ్యక్తిగత కార్యదర్శితో కొంగరకలాన్ సమీపంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరై తన వాదనను వినిపించారు.

# కొండా సురేఖకు రైతుల నిరసన సెగ

- రుణమాఫీ చేయక మోసగించారని ఆరోపణ
- సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు

దుబ్బాక, జనవరి 18 : సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖకు రైతుల నిరసన సెగ తగిలింది. రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని ఆందోళనకు దిగారు. శనివారం దుబ్బాక నియోజక వర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖను రుణమాఫీపై రైతులు నిలదీశారు. మంత్రి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రుణమాఫీ పేరిట రైతులను మోసగించిందని రోడ్డుపై బైఠాయించారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ పెద్దపెట్టున నినదించారు. అదేవిధంగా అక్బర్‌పేట-భూంపల్లిలో ఆరోగ్యకేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డితోపాటు మరికొందరు నాయకులను అనుమతించారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ నాయకులను ఎలా అనుమతించారని పోలీసులను ప్రశ్నించారు. ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు.

## సంక్షేమ పథకాలు అందడం లేదు

### కొండా సురేఖ ఎదుట వాపోయిన కాంగ్రెస్ నాయకులు



సిద్దిపేట అర్బన్, జనవరి 18 : తమ గ్రామానికి సంపూర్ణంగా ప్రభుత్వ పథకాలు అందడం లేదని మంత్రి కొండా సురేఖ ఎదుట కాంగ్రెస్ నాయకులు వాపోయారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో శనివారం సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఇప్పటివరకు రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తమ గ్రామానికి కేవలం 60 రేషన్ కార్డులు మాత్రమే మంజూరయ్యాయని, ఇంకా చాలా రేషన్ కార్డులు అవసరమని సూచించారు.

# నల్లగొండ రైతు మహాధర్నాకు సన్నాహకాలు

- అనుమతి కోరుతూ ఎస్పీకి వినతి
- క్లాక్‌టవర్ సెంటర్‌లో ధర్నాస్థలి పరిశీలన
- పార్టీలకు అతీతంగా తరలిరావాలని బీఆర్‌ఎస్ నేతల పిలుపు




నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో రైతు మహాధర్నా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : నల్లగొండలో ఈ నెల 21న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్న రైతు మహాధర్నాకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. షాబాద్ రైతు ధర్నా వేదికగా కేటీఆరే నల్లగొండ మహాధర్నాపై ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దాంతో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలంతా నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మహాధర్నాకు అనుమతి, స్థలం ఎంపిక, స్వచ్ఛందంగా తరలివచ్చే రైతుల సంఖ్య, అందుకు పార్టీపరంగా చేయాల్సిన ఏర్పాట్లు, ధర్నా స్థలంలో కల్పించాల్సిన సౌకర్యాలు, తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో రైతులను కదిలిస్తే ఎవరూ కాంగ్రెస్ ప్రభుత్వంపై సంతృప్తిగా లేరని, కేసీఆర్ పాలననే గుర్తు చేసుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా కేటీఆర్ తలపెట్టిన రైతు మహాధర్నాకు పెద్ద సంఖ్యలో రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉంటారని అంచనా వేస్తున్నారు. పార్టీ కార్యాలయం నుంచి ముఖ్య నేతలంతా జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను కలిసి ఈ నెల 21న నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో రైతుమహాధర్నాకు అనుమతి కోరుతూ లేఖను అందజేశారు. మహాధర్నాకు కేటీఆర్ హాజరవుతున్నారని, ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా ఉంటుందని ఎస్పీకి తెలిపారు. అనంతరం నేతలంతా క్లాక్‌టవర్ సెంటర్‌లోని ధర్నా స్థలాన్ని పరిశీలించారు. రైతుమహాధర్నాకు సర్కార్ సాయం అందని రైతులంతా పార్టీలకతీతంగా తరలిరావాలని బీఆర్‌ఎస్ నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాల అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, బడుగుల లింగయ్య యాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

## ట్రిపుల్ ఆర్ బాధిత రైతు మృతి

- అధికారుల నోటీసుతో మనోవేదన



వలిగొండ, జనవరి 18 : రీజినల్ రింగ్ రోడ్డులో జీవనాధారమైన భూమి పోతుందనే మనోవేదనతో ఓ రైతు అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లికి చెందిన రైతు నాగెల్లి చిన్న లక్ష్మయ్యకు గ్రామంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అందులో నుంచి ఎకరం 30గుంటల భూమి ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో కోల్పోతున్నట్టు అధికారులు నోటీసులు ఇచ్చారు. దాంతో తమకు జీవనాధారమైన భూమిని కోల్పోయి బతకడం ఎలా అని కొంత కాలంగా మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే అనారోగ్యం బారిన పడిన లక్ష్మయ్య శనివారం మృతిచెందాడు.


కళ్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy,
Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439



| వధువు కావలెను | వరుడు కావలెను |
| --- | --- |
| ★బ్రాహ్మిణ్స్:30 Yrs, 5'9", B.Tech, MBA, Manager, 13 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888 | ★బ్రాహ్మిణ్స్:25 Yrs, 5'3", B.Tech., SWE, 7.5 Lakhs P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9701960229 |
| ★రెడ్డి:28 Yrs, 6'2", BE, Data Engineer, USA, 160K P/A, 100 Cr. గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★రెడ్డి:26 Yrs, 5'3", MS, SWE, USA, 100K P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★మున్నూరుకాపు:31 Yrs, 5'10", B.Tech, SWE, 30 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599 | ★మున్నూరుకాపు:29 Yrs, 5'2", B.Tech., SWE, 15 LAKHS P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★పద్మశాలి:32 Yrs, 5'7", B.Tech, MS, SWE, USA, 120K P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444 | ★పద్మశాలి:26 Yrs, 5'3", B.Tech, SWE, 7 Lakhs P/A వధువుకు తగిన వరుడు కావలెను. 9010051444 |
| ★గంగపుత్ర:27 Yrs, 5'7", B.Tech, SWE, 25 Lakhs P/A వరుడికి తగిన వధువు కావలెను. 7207930999 | ★గౌడ్స్:27 Yrs, 5'4", B.Tech, SWE, 4.8 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999 |
| ★రజక: 30 Yrs, 5'6", B.Tech, Sr. Engineer, 12 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777 | ★ముదిరాజ్:28 Yrs, 5'2", B.Tech., SWE, 9 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★ముదిరాజ్: 29 Yrs, 5'10', BDS, Pvt. Job, 8 Lakhs P/A, 10 Cr. గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★గంగపుత్ర:28 Yrs, 5'3", B.Tech, MBA, Manager, 12 Lakhs P/A గల వధువుకు వరుడు కావలెను. 9701960229 |
| ★ నాయీబ్రాహ్మిణ్స్: 32 Yrs, 5'6", B.Tech., SWE, 25 Lakhs P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888 | ★SC మాల: 29 Yrs, 5'4", B.Tech, SWE, 80,000/- P/M గల వధువుకు వరుడు కావలెను. 9246960888 |
| ★SC మాల:29 Yrs, 5'9",B.Tech, (IIT), SWE, 22 Lakhs P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599 | ★SC మాదిగ: 26 Yrs, 5'2", B.Tech, SWE, 4 Lakhs P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★SC మాదిగ:31 Yrs, 6 Ft, B.Tech Manager, 50,000/- P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9010051444 | ★2nd MATCH గౌడ్స్: 35 Yrs, 5'2", MS, SWE, USA, 100K P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9010051444 |

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857